# చదువుతో పాటు క్రీడలు ముఖ్యం



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28: చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో ఇక్రా ఇంటర్నేషన్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు కూడా చాలా అవసరమన్నారు. 30 ఏండ్ల వయసు ఉన్న యువతకే ఎక్కువశాతం గుండెపోటు లాంటి సమస్యలు ఎదురవుతున్నాయని, దీనికి కారణం వాకింగ్, వ్యాయామం, యోగా లాంటివి చేయకపోవడమే హరీశ్‌రావు అన్నారు.

# సిద్దిపేటలో మున్సిపల్ అధికారుల పర్యటన


సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న 11 మున్సిపాలిటీల అధికారులు

సిద్దిపేట, ఫిబ్రవరి 28: సిద్దిపేట పట్టణంలో శుక్రవారం రాష్ట్రంలోని 11 మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పర్యటించారు. పట్టణ శివారులోని సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం, డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్, సిద్దిపేట పట్టణంలోని స్వచ్ఛబడి తదితర వాటిని సందర్శించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణతో పాటు ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం అన్ని హంగులతో నిర్మించిన స్వచ్ఛబడిని సందర్శించారు. హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని అధికారులు పరిశీలించారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ ఇంటింటా వెలువడే తడి చెత్త ద్వారా తయారవుతున్న సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. స్వచ్ఛబడిలో చెత్త సేకరణ, చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా వేరు చేయడం, చెత్తతో సంపదను సృష్టించడం, చెత్తతో ఇండ్లలోనే ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను అరికట్టడానికి వార్డు స్థాయిలో స్టీల్ బ్యాంక్‌లు ఏర్పాటు చేశామని, ఇప్పటికే పట్టణంలో జరుపుకుంటున్న శుభకార్యాలకు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకం నిషేధిస్తూ స్టీల్ బ్యాంక్‌లను సద్వినియోగం చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు హేమలత, ప్రేరణ, హన్మంత్‌రెడ్డి, వనిత, 11 మున్సిపాలిటీల అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లన్న పాలక మండలి సభ్యుడిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 28: మహా శివరాత్రి పర్వదినం రోజు కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో జరిగిన పెద్దపట్నం వద్ద మల్లన్న ఆలయ పాలక మండలి సభ్యుడు జయప్రకాశ్‌రెడ్డి పాదరక్షలు ధరించి పట్నం వద్ద తిరిగాడని, సదరు పాలక మండలి సభ్యుడిని దేవాదాయశాఖ అధికారులు సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, పాలక మండలి మాజీ సభ్యుడు ముత్యం నర్సింహులుగౌడ్ డిమాండ్ చేశారు. మల్లన్న ఆలయం వద్ద బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపట్నం రోజు జయప్రకాశ్‌రెడ్డి పాదరక్షలు ధరించి కర్ర పట్టుకొని పట్నం సమీపంలో కలియ తిరుగుతూ భక్తులను బూతులు తిట్టాడన్నారు. రెండో ఆదివారం సందర్భంగా ప్రైవేట్ బ్యాంకు సిబ్బందిపై దౌర్జన్యం చేశాడని ఆరోపించారు. పాలక మండలిలో ఇలాంటి వ్యక్తులకు కాంగ్రెస్ చోటు కల్పించడం సిగ్గుచేటన్నారు. దేవాదాయ శాఖ అధికారులు విచారణ జరిపి ఆయన్ని సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు మహేశ్, కొండ శ్రీధర్, సిలివేరు కనకమల్లేశ్, గొల్లపల్లి ఆంజనేయులు, రమేశ్, స్వామి, కనకచారి పాల్గొన్నారు.

**ఆలయ అధికారులకు ఫిర్యాదు**

చేర్యాల, ఫిబ్రవరి 28 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి పెద్దపట్నం సందర్భంగా ఆలయ పాలక మండలి సభ్యుడు జయప్రకాశ్‌రెడ్డి పాదరక్షలు వేసుకుని పట్నం వద్ద కలియతిరిగి, అపవిత్రం చేశాడని ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలం కేంద్రంలో నిర్వహించిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు అత్తిని శారద, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, నీల భిక్షపతి, కర్రోళ్ల ఎల్లయ్య, కానుగుల రాజు పాల్గొన్నారు

**ఆలయ అధికారులకు ఫిర్యాదు**

పట్నం వద్ద పాదరక్షలు వేసుకుని అపవిత్రం చేసిన పాలక మండలి సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గొర్రెలు,మేకల పెంపకందారులు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయంలో ఫిర్యాదు చేశారు.కార్యక్రమంలో దాసరి మహేశ్, నంగి చంద్రమౌళి పాల్గొన్నారు.

# ఉద్యమకారులను ఆదుకోవాలి


పోస్టల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

చేర్యాల, ఫిబ్రవరి 28: తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాల్లో పాల్గొని కేసుల పాలైన ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు అందె అశోక్, అంబటి అంజయ్య, బండోజు భాస్కర్ కోరారు. శుక్రవారం టీయూఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్టల్ కార్యాలయం నుంచి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ఉద్యమకారులు కేసుల పాలై జైలు జీవితాలు గడిపినట్లు గుర్తుచేశారు.తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందుకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.25వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఎండీ.జహీరొద్దీన్, తౌట రమేశ్, గజ్జల సురేందర్, మ్యాక యాదయ్య, అంజయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

# ఓటీ నిర్మాణం చేపడితే ఆందోళన చేస్తాం


జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నంగునూరు, ఫిబ్రవరి 28: కమలాయపల్లి వద్ద ఓటీ నిర్మాణం చేపడితే ఆందోళన చేస్తామని మండలంలోని 10 గ్రామాల రైతులు తెలిపారు. శుక్రవారం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్‌రెడ్డి, ఈఈ గోపాలకృష్ణకు 10 గ్రామాల రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేర్యాల మండలం కమలాయపల్లి వద్ద ఓటీ నిర్మాణం చేస్తే 10 గ్రామాల రైతులకు తీవ్ర అన్యాయం జరగనుందన్నారు. కమలాయపల్లికి ముందు పైప్‌లైన్ నుంచి ఓటీ నిర్మాణం చేపట్టి డీ3 కాలువకు అనుసంధానం చేయడం వల్ల రంగనాయకసాగర్ కుడి కాలువ ద్వారా కమలాయపల్లి, అర్జునపట్ల, జాలపల్లి, ధూళిమిట్ట గ్రామాలకు నీరు అందుతుందని, ఇప్పటికే ఈ గ్రామాలకు తపాస్‌పల్లి ద్వారా ఆయకట్టు స్థిరీకరణ జరిగిందన్నారు. ఇపుడు ఓటీ చేపట్టడం వల్ల నంగునూరు మండలంలోని మైసంపల్లి, అంక్షాపూర్, ఖానాపూర్, నాగరాజుపల్లి, నంగునూరు, అక్కెనపల్లి, ఘన్‌పూర్, కొండంరాజ్‌పల్లి, గట్లమల్యాల, ఖాతా గ్రామాల రైతులకు నష్టం జరగనుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, పురేందర్, నాయకులు కృష్టారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మనుచౌదరి


మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28: జిల్లాలో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టెన్త్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే టెన్త్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 79 పరీక్షా కేంద్రాల్లో 14,138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందులో 14,124 మంది రెగ్యులర్, 14 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, అధికారులు పాల్గొన్నారు.

**ఇంటర్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి**

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28: ఇంటర్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె ఇంటర్ పరీక్షలపై పలువురు అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. జిల్లాలో 43 పరీక్షా కేంద్రాల్లో 20,595 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని, ఇందులో ఫస్టియర్ విద్యార్థులు 9,770 మంది, సెకండియర్ విద్యార్థులు 10,815 మంది ఉన్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


గజ్వేల్: సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి


కొమురవెల్లి: విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈవో రమేశ్

## ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిట్లు

విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. శుక్రవారం జిల్లావ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. చిన్నతనం నుంచే వివిధ అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు.

– సిద్దిపేట జిల్లానెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 28


మిరుదొడ్డి: కాసులాబాద్ పాఠశాలలో విద్యార్థులు చేసిన ప్రయోగాలు


హుస్నాబాద్‌రూరల్: సైన్స్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో మనీలా

# 'మేరు'కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలి


మాట్లాడుతున్న భూమయ్య

హుస్నాబాద్, ఫిబ్రవరి 28: బట్టలు కుట్టడమే జీవనాధారంగా చేసుకొని కుటుంబాలను వెల్లదీస్తున్న మేరు కులస్తులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని హుస్నాబాద్ మేరు సంఘం అధ్యక్షుడు గూడూరు భూమయ్య కోరారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని సంఘం భవనంలో టైలర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ నిధులు లేక ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదన్నారు. రెడీమేడ్ దుస్తులు వస్తున్నందున మేరు కులస్తులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నన్నె కిషన్, నాయకులు చంద్రమౌళి, శ్రీనివాస్, అక్కు కిరణ్, సంజీవ్, సురేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 28: విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. శుక్రవారం చెప్యాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్ బాబు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో పాలుపంచుకోవాలి


వెంకన్నగౌడ్ దంపతులను సన్మానిస్తున్న సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 28: ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక ఆర్టీసీ కంట్రోలర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బూర వెంకన్నగౌడ్ సన్మాన, వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిస్వార్థంగా పనిచేసిన ఉద్యోగులకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం వెంకన్న దంపతులను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, మాజీ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు తిరుపతిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి రాధిక


ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాధిక

రాయపోల్, ఫిబ్రవరి 28: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి రాధిక హెచ్చరించారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఏవో సాయికిరణ్, ఏఈవోలు ఉన్నారు.

# నేడు మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 28: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభ శనివారం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అశోక్ అన్నారు. హుస్నాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, మాదిగల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పలువురు తమ ప్రాణాలను పణంగా పెట్టారని గుర్తుచేశారు. హుస్నాబాద్ పట్టణంతోపాటు మండలానికి చెందిన మాదిగలు, ఉపకులాలు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ లింగాల సాయన్న, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, నాయకులు కండే సుధాకర్, ముక్కెర సంపత్, గడ్డం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# హక్కులపై అవగాహన కలిగి ఉండాలి


పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై విజయ్‌కుమార్

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 28: పౌరుల హక్కులకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ హెచ్చరించారు. శుక్రవారం మద్దూరు, ధూళిమిట్ట గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై పౌరులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అంటరానితనం, అస్పృశ్యత వంటి సాంఘిక దురాచారాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమాల్లో ఏఎస్సై విజయ్‌కుమార్, ఆర్ఐలు రవీందర్, రమేశ్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సిద్ధేశ్వర్ పాల్గొన్నారు.

# విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న ఎగొండస్వామి

గజ్వేల్, ఫిబ్రవరి 28: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం 15శాతం నిధులు కేటాయించాలని కోరుతూ డీబీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అనంతరావుపల్లిలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యారంగాన్ని పరిరక్షించుకుందామని, నాణ్యమైన విద్య అందించాలన్నారు. 2024–25 బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులు మాత్రమే కేటాయించారని, 2025–26 బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు కరువై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మైసయ్య, బాల్‌నర్సింహులు, దార మల్లేశం, భూమవ్వ, కొప్పు లక్ష్మి, లక్ష్మి, నర్సవ్వ పాల్గొన్నారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో విహాన్‌రామ్‌కు చోటు


విహాన్‌రామ్

మద్దూరు (ధూళిమిట్ట), ఫిబ్రవరి 28: ధూళిమిట్ట మండలంలోని హనుమతండాకు చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు తొమ్మిదేండ్ల బాలుడు మాస్టర్ జాటోత్ విహాన్‌రామ్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది. ఆఫ్రికాలోని కిలిమంజారో, హిమాచల్‌ప్రదేశ్‌లోని మౌంట్ పాతాల్సును విజయవంతంగా విహాన్‌రామ్ అధిరోహించినట్లు అతడి తండ్రి తిరుపతి నాయక్ తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకున్న విహాన్‌రామ్‌ను గ్రామస్తులు, పలువురు నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి, గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# చెరువు ఆధునీకరణ పనులు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


ఎల్లమ్మ చెరువు కట్టపై అధికారులతో మాట్లాడుతున్న గరిమాఅగర్వాల్

హుస్నాబాద్, ఫిబ్రవరి 28: హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు ఆధునీకరణ పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్లమ్మ చెరువును సందర్శించి చెరువు కట్టపై చేయనున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువుకట్టను ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.32కోట్లు మంజూరయ్యాయని, ఇందులో రూ.18కోట్లకు టెండర్లు పూర్తయినందున పనులు వెంటనే మొదలుపెట్టి పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఈఈ రాములు నాయక్, ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**పుస్తక పఠనం అలవర్చుకోవాలి**

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 28 : బాలలు పుస్తక పఠనం అలవర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సూచించారు. నేషనల్ బుక్ ఆఫ్ ఇండియా వారు సిద్దిపేట మల్టీపర్పస్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సంచార పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 2 వరకు సంచార పుస్తక ప్రదర్శన జరుగుతుందని నేషనల్ బుక్ ఆఫ్ ఇండియా దక్షిణ భారతదేశ ఇన్‌చార్జి డాక్టర్ పిత్తిపాక మోహన్ తెలిపారు. సెక్టోరియల్ అధికారి భాస్కర్, విద్యాధికారి రాజప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకుడు విజయ్‌కుమార్, కవులు, రచయితలు ఐతా చంద్రయ్య, గరిపల్లి అశోక్, జంగిటి శాంతకుమారి, సమ్మెట ఉమాదేవి, ఎన్నవెల్లి రాజమౌళి, రాజేశం, అమ్మన చంద్రారెడ్డి, సురేందర్, రాజిరెడ్డి, కొడిచెల్లి రామానుజ, జెగ్గారి నిర్మల పాల్గొన్నారు.

**గురుకుల పాఠశాల సందర్శన**

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28: మండలంలోని పోతారం(ఎస్)లోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగది, సామగ్రిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని బెడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలించి అభినందించారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ కోర్టు జడ్జి కృష్ణతేజ అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లెలగడ్డ ప్రభుత్వ కేజీ టు పీజీ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఇష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## నమూనాలు భేష్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 28: గణితశాస్త్రంపై విద్యార్థులకు ఉన్న పట్టు, వారు స్వయంగా తయారు చేసిన నమూనాలు బాగున్నాయని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అభినందించారు. డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం గణిత శాస్త్రం అంశాలపై వివిధ రకాల నమూనాలను పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రదర్శించారు. గణిత ప్రదర్శనశాలను ఆమె సందర్శించి గణితంలో విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు పవన్‌కుమార్, అయోధ్యరెడ్డి, రాధిక, లక్ష్మీనరసింహారెడ్డి, సంగీత, దీపిక, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బేస్‌బాల్‌కు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ క్రీడకు ఎంపికైన విద్యార్థులు

వర్గల్, ఫిబ్రవరి 28: మండలంలోని వేలూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు, నెంటూర్ విశ్వశాంతి విద్యానికేతన్ హైస్కూల్ నుంచి మరో ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ క్రీడలకు ఎంపికైనట్లు జిల్లా బేస్‌బాల్ క్రీడ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి తెలిపారు. ప్రస్తుతం గజ్వేల్‌లో జరుగుతున్న రాష్ట్రపోటీలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. బేస్‌బాల్ క్రీడ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూర్ మధుయాదవ్, జిల్లా చైర్మన్ గుండుకాడి వెంకటేశ్‌గౌడ్, ప్రిన్సిపాల్ దేవీదయాకర్, పీఈటీ విఠల్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వర్గల్, ఫిబ్రవరి 28: రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వర్గల్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ టీచర్స్ కాలనీకి చెందిన శ్యామ్ బహదూర్ సింగ్, అతడి స్నేహితులు చందుయాదవ్, వాకిటి సాయికుమార్‌తో కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి వస్తున్న ట్రక్ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్ వేయకుండా గౌరారం మామిడ్యాల కమాన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కారును బలంగా ఢీకొట్టాడు. దీంతో శ్యామ్‌బహదూర్‌సింగ్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

## సైకిల్ పైనుంచి పడి వ్యక్తి మృతి

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 28: సైకిల్ పై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని మర్పడగలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుడికందుల భిక్షపతి(40) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగుస్తున్నాడు. శుక్రవారం నిత్యావసర సరుకుల కోసం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా సైకిల్ అదుపుతప్పి కింద పడటంతో తలకు బలమైన గాయమైంది. దీంతో 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భిక్షపతి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28: అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, మూడు టిప్పర్లను సీజ్ చేసిన సంఘటన మండలంలోని బక్రిచెప్యాల గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. రెవెన్యూ, పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బక్రిచెప్యాల, వెల్కటూర్ గ్రామాల శివారులో ఉన్న వ్యవసాయ పొలం నుంచి మూడు రోజులుగా అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి ఒక జేసీబీ, మూడు టిప్పర్లను సీజ్ చేశారు. ఎవరైనా మట్టి తరలించాలంటే మైనింగ్, రెవెన్యూశాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.